అందుకే జగన్ కావాలి..

రాష్ట్ర ప్రజలకు రానున్న రోజుల్లో కూడా మరింత మేలు జరగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంత మేలు చేశారో వివరంగా చెప్పడానికే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ తెలిపారు. నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

- సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా
- అభివృద్ధితో మరింత చేరువ
- విద్య,వైద్యానికి పెద్దపీట
- నాలుగురేళ్ల సీఎం జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు
- నియోజకవర్గంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'
- ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించిన పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



మాట్లాడుతున్న పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



ఎస్సీబీసీ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపట్నం : ఆంధ్రప్రదేశ్‌లో పేదల జీవితాలు బాగుపడాలన్నా..రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా అది ఒక్క వైఎస్సార్‌సీపీతో నేనని ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 92వ వార్డు 458 సచివాలయం పరిధి ఎస్సీ,బీసీ కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో సచివాలయం నుంచి సభా ప్రాంగణం వరకు మహిళలు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మనాభనగర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఆడారి ఆనంద్ కుమార్ పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదప్రజల జీవితాలు మారిపోయాయన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాల పేరుతో నేరుగా వారి అకౌంట్లలోనే నగదు జమ చేయడం గొప్పవిషయమన్నారు. సంక్షేమ పథకాల అమల్లో ఎటువంటి అవినీతి, అవకతవకలకు ఆస్కారం లేని విధంగా పాలన అందిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. ఈ సచివాలయం పరిధిలో రూ.20,57,82,877 కోట్లతో మొత్తం 33 రకాల డైరెక్ట్ బెనిఫిట్, ఇన్‌డైరెక్ట్ బెనిఫిట్ ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలవద్దకు తీసుకువెళ్లాలని, వారి అభిప్రాయాలను సేకరించాలని పార్టీ కార్యకర్తలు, నేతలకు సూచించారు. గత టీడీపీ ప్రభుత్వం..నాటి ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల మేనిఫెస్టోను ఏడాదిలోనే వెబ్‌సైట్‌లో నుంచి మాయం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఏర్పడిన మార్పును గమనించాలన్నారు.

ఎవరు ఎలా వచ్చినా పట్టించుకోం

ఎవరు ఎలా వచ్చినా..ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ పట్టించుకోదని, తాము పట్టించుకునేది కేవలం ప్రజలను మాత్రమేనని ఆడారి ఆనంద్ స్పష్టం చేశారు. కొందరు నాయకులు ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా..చంద్రబాబును సీఎం చేద్దామంటూ మైకుల వద్ద ఊగిపోతూ మాట్లాడుతుంటారని, ఎంత పేకేజీ అందితే అంత ఊగిపోవడం సదరు నేతకే చెల్లిందని విమర్శించారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించింది చంద్రబాబు అండ్ గ్యాంగేనన్నారు. నియోజకవర్గంలో రూ.70 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. అలాగే మరో రూ.11 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కాపు కల్యాణమండపం నిర్మించేందుకు రూ.2కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రూ.5.50 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ఏడేళ్ల క్రితమే ఈ ఆస్పత్రిలో సొంత నిధులతో పలు సౌకర్యాలు కల్పించానని ఆడారి ఆనంద్ కుమార్ చెప్పారు. నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో నాడూ నేడు ద్వారా అదనపు గదులు, మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలిపించుకోవాలని కోరారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాఠశాలలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. కర్నాటకలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోను ఏపీలో టీడీపీ, జనసేన కాపీ చేశాయని విమర్శించారు. అనంతరం ఆర్‌పీలకు, సచివాలయం కన్వీనర్లకు ఆడారి ఆనంద్‌కుమార్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ సచివాలయ కార్యదర్శులు, పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏపీడీ శ్రీరామ్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి భద్రీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, చుక్క ప్రసాద రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి గేదెల మురళీ కృష్ణ, పిల్లా కన్న బాబు, ఆళ్ల పైడిరాజు, బండారు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, సచివాలయ కార్యదర్శులు

బూత్ కన్వీనర్లతో సమావేశం



బూత్ కన్వీనర్లకు సూచనలు ఇస్తున్న 63వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రామ్మోహనరెడ్డి

సింధియా : పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ సచివాలయాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్ కలిసి బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆదివారం కూడా ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహిస్తామని, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనుకునేలా బూత్ కన్వీనర్లు చొరవ తీసుకోవాలన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవోలు



నోటు పుస్తాకాలు పరిశీలిస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో సోమేశ్వరరావు పదోతరగతి విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. వారు చదువుతున్న తీరును సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలనుంచి వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్తేర్ హెప్సిబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



గౌరీపరమేశ్వరులు

మల్కాపురం: గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంత గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను మల్కాపురం సేవా మార్గం నుంచి ప్రకాష్‌నగర్ వరకు ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సేవ గరడి, కోలాట ప్రదర్శన నడుమ గౌరీ పరమేశ్వరులను ప్రకాష్‌నగర్ వద్ద గల గౌరీదేవి మందిరం వద్ద నెలకొల్పి పూజలు జరిపారు. వచ్చే నెల 16 తేదీ వరకు ఉత్సవాల నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మల్కాపురం : గాజువాక ఆర్టీసీ డిపో ఆవరణలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలు, లోపాలు ఇతర సమస్యలేమైన డయల్ యువర్ డీఎం 9959225501, 7382913422 నంబర్‌కు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ వి.ప్రవీణ తెలిపారు.

వృద్ధురాలికి వైద్య సేవలు



వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న మమత

విశాఖ విద్య: నిస్సహాస్థితిలో రహదారి పక్కన పడిఉన్న వృద్ధురాలికి మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. గురువారం 104 ఏరియాలో ఒంటిమీద బట్టలు లేకుండా రహదారి పక్కనే వృద్ధురాలు పడిఉందనే సమాచారం తెలుసుకున్న మమత ఎయిర్‌పోర్టు కానిస్టేబుల్ కోటేశ్వరరావు సహకారంతో అక్కడికి వెళ్లారు. వృద్ధురాలికి దుస్తులు వేసి, సపర్యలు అందించిన అనంతరం ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్న చేశారు. పెందుర్తిలో ఉండే కూతురు ఇక్కడికి తీసుకొచ్చి వదిలివెళ్లిపోయినట్లుగా చెప్పటంతో ఆ వృద్ధురాలిని వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అనంతరం కుటుంబీకుల చెంతకు చేర్చేలా తగిన బాధ్యతలు తీసుకునేందుకు ముందుకొచ్చిన మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు మమతను పలువురు అభినందించారు.

రెడ్‌షర్ట్ వలంటీర్లకు శిక్షణ



రెడ్‌షర్ట్ వలంటీర్లుకు శిక్షణ ఇస్తున్న సీపీఎం నాయకులు

సింధియా : ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరగనున్న సీపీఎం ప్రజారక్షణ భేరి భారీ ర్యాలీలో సేవలందించే రెడ్ షర్ట్ వాలంటీర్లకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్ గ్రౌండ్‌లో డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షుడు యు.రాజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర సరుకులను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేశాయన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు అమ్మకాలకు పూనుకొని, నిరుద్యోగం పెంచి యువతకు ఉపాధి లేకుండా చేస్తున్న కేంద్రప్రభుత్వ తీరును ప్రజలందరు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రావణ్, వాసు, సాయి, సీపీఎం నాయకులు లక్ష్మణమూర్తి, పెంటారావు, కృష్ణ, అర్జునరావు, జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే రైల్వే భద్రత



సెమినార్‌లో మాట్లాడుతున్న కె.సి.జేమ్స్

కంచరపాలెం: రైల్వే భద్రత అంశాలపై ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సి.జేమ్స్ మాట్లాడుతూ ఇటీవల కేపీఎల్-ఏఎల్ఎం సెక్షన్ మధ్య పలాస-రాయగడ ప్యాసింజర్‌లు ఢీకొన్న సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ విషాద ఘటన తర్వాత రైల్వేలో భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన రైల్వే ఉద్యోగులతో పాటు ప్రయాణికులకు సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలేమిటో కాకుండా.. ఎవరు బాధ్యులన్న ఉద్దేశంతో రైల్వే అధికారులు ప్రమాదాలపై ఆరా తీస్తున్నారన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎస్.కె.చౌబే, కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కుమార్, జగన్, పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల కన్వీనర్ రెడ్డి వెంకటరావు, ఏఐఎల్ఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వి.ఎస్.రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నోడు, పాణిగ్రాహి, హరికృష్ణ, సంతోష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

భలే 'మంచు'రోజు



పారిశ్రామిక ప్రాంతంలో పొగమంచు

మల్కాపురం : వాతవరణంలో కలిగిన మార్పో..శీతాకాలం మహిమో తెలియదు గానీ పొగమంచు పారిశ్రామిక ప్రాంతాన్ని కమ్ముకుంది. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేని పరిస్థితి ఎదురైంది. ఈ 'స్నో'గయం చూసి వాహనదారులు అరకులో ఉన్న అనుభూతిని పొందారు.

జెడ్పీ స్కూల్‌లో అమెజాన్ బృందం



గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెజాన్ బృందంతో విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అమెజాన్ కేంద్ర కమిటీ సభ్యులు సందర్శించారు. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమాన్ని(ఈఎండీపీ) అమలు తీరును, విద్యార్థులకు ఏవిధంగా ఉపయోగపడుతుందన్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపధ్యాయుడి ఆధ్వర్యంలో విద్యార్థులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థుల సృజనాత్మకతను పరిశీలించారు. వీరు చేసిన ప్రాజెక్టులను మెచ్చుకున్నారు. పలువురు విద్యార్థులు వారి ప్రతిభను కమిటీ సభ్యుల ముందు ప్రదర్శించారు. అమెజాన్ బృందం సభ్యురాలు సారా హుస్సేన్ మాట్లాడుతూ ప్రతీ విద్యర్థిలో సృజనాత్మకత లోటుఉండదన్నారు. వాటిని గుర్తించి వెలికి తీస్తే ఒక వ్యవస్థాపకుడిలా రూపాంతరం చెందుతాడన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు జొన్నలగడ్డ జయవర్ధన్, చాగంటి బ్రహ్మం, కాకర నరేష్, ఉపాధ్యాయులు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో కోటి ఒత్తుల దీపోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సౌర్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి

సింహాచలం: విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో సింహాచలంలో కోటి ఒత్తుల దీపోత్సవాలు నిర్వహిస్తునట్టు విశాఖకు చెందిన హిమాలయ సౌర్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద కార్యక్రమాల వివరాల కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌యోగి మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో ఉండాలన్నా...ఆనందంతో జీవించాలన్నా సనాతన ధర్మం ఒక్కటే మార్గమని తెలిపారు. సనాతన భారతీయ ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద, హవేలీ గ్రౌండ్‌వద్ద, వరాహపుష్కరిణి వద్ద కోటి ఒత్తుల దీపోత్సవ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 8న నగరంలోని జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి సింహాచలంలోని తొలిపావంచా వరకు భారీ ఎత్తున భారీకలశ యాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధిలు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, నమ్మి రాజగోపాల్, భీశెట్టి నాగభూషణం, కాళ్ల జగన్ మోహన్, ఆర్.జయరాజ్, బూరాడ సాయి రోజా, జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పరుగులు





వార్డు పరిధి బర్మాకాలనీ, పవన్‌పుత్రకాలనీ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన బీటీ రోడ్లు



కళకళలాడుతున్న ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ రహదారి

- రూ.4 కోట్లతో రూపురేఖలు మారిన 60వ వార్డు
- నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతంలో బీటీ రోడ్లు, సీసీ రహదారుల్లో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డ వార్డువాసులు ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రహదారులు మెరుగుతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వివిధ ప్రాంతాల్లో కాలువలు ఇతర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వార్డు పరిధి ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీలో రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, జవహర్‌నగర్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, జవహర్‌నగర్ నుంచి ఇందిరాకాలనీ వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, బర్మాకాలనీ నుంచి దుర్గాదేవి ఆలయం వరకు సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అలాగే జవహర్‌నగర్ వివేకానంద స్కూల్ మార్గం సీసీ రోడ్డు పనులు, ఇందిరాకాలనీ కొండ ప్రాంతంలో రూ.20 లక్షలతో రక్షణగోడ నిర్మాణం పూర్తయ్యాయి. సుమారు రూ.4 కోట్ల మేర అభివృద్ధి పనులు పూర్తవ్వడంతో వార్డు స్వరూపం పూర్తిగా మారిపోయింది. మరికొన్ని అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారులు సక్రమంగా లేక నరకం చవిచూశామని, ఇప్పుడు వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడం చాలా ఆనందంగా ఉందని వార్డు ప్రజలు పేర్కొంటున్నారు.

అభివృద్ధి చేసి చూపించాం



తన వార్డులో గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ అభివృద్ధి పనులు చేసి చూపించాం. గత ప్రభుత్వాలు హామీలతో సరిపెడితే..తాము అభివృద్ధితో ముందుకువెళ్లాం. గతంలో జవహర్‌నగర్, బర్మాకాలనీ, ఇందిరా కాలనీ, అశోక్‌నగర్, పవన్‌పుత్ర కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా శిథిలావస్థలో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక నేడు- నేడు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా కోట్ల రూపాయాలతో ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేశాం.

–పీవీ సురేష్, కార్పొరేటర్

నాడు వెలవెల.. నేడు కళకళ



జీవీఎంసీ 60వ వార్డు పరిధిలో గత ప్రభుత్వ హయాంలో శ్రీహరిపురం, బర్మాకాలనీ, ఇందిరాకాలనీ ప్రాంతాలలో రహదారులపై ప్రయాణించే పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా గతుకులతో ఒళ్లు హూనమయ్యేంది. అలాగే వార్డులో కనీస సౌకర్యాలు ఉండేవి కావు. నేడు ఆ పరిస్థితి లేదు. రహదారులు మెరుగుపడ్డాయి. వార్డులో సౌకర్యాలు కల్పించారు. రహదారులు, డ్రైనేజీ సిస్టం అభివృద్ధి చేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు రుణపడి ఉంటాం.

–ఆడారి హరీష్, శ్రీహరిపురం

పేదల వైద్యానికి భరోసా



ఇందిరాకాలనీ ప్రాంతంలో పట్టణ ఆర్యోగ కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి పేద ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలిచింది. ఉచితంగా వైద్యం అందిస్తూ పెద్ద దిక్కుగా నిలిచింది. అలాగే వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, విద్యుత్ లైట్లు సమస్యలు పూర్తిగా తొలగిపోయాయి. ప్రస్తుతం వార్డు అభివృద్ధితో కళకళలాడుతోంది.

–సత్తిబాబు, ఇందిరాకాలనీ

కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ లోగో ఆవిష్కరణ

డాబాగార్డెన్స్ : జాతీయ స్థాయిలో నూతనంగా ప్రారంభించిన కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ లోగోను నగరంలోని ఓ హోటల్లో సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మందికి సేవలందించాలనే ఆలోచనతో ఈ సంస్థ ప్రారంభించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, విజయవాడ, కడప వంటి ప్రాంతాల్లో వినియోగదారుల తరఫున ఎన్నో కేసులు నమోదు చేశామన్నారు. అలాగే తెలంగాణతో పాటు బీహార్ తదితర రాష్ట్రాల్లో కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చాలా మందికి కోర్టుల ద్వారా న్యాయం జరిగిందని చెప్పారు. సేవలు మరింత విస్తృతం చేయడానికి సొంతంగా జాతీయ స్థాయిలో కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్‌ను ప్రారంభించామన్నారు.

జిల్లా ప్రగతిపై సదస్సు నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏయూ అలుమ్ని హాలులో 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి-విశాఖపట్నం జిల్లా ప్రగతి' అనే అంశంపై సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

లేపాక్షిలో దీపావళి దియాస్



టెర్రకోట, డిజైనర్ ప్రమిదలు

డాబాగార్డెన్స్ : వెలుగుల పండగ దీపావళి సందర్భంగా ఎన్నెన్నో డిజైనర్ దీపాలు నగర ప్రజల అందుబాటులో ఉంచినట్టు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ కార్తీక్‌కుమార్ తెలిపారు. లక్ష్మీదేవి, గణపతి మట్టి బొమ్మలతో రెండు.. మూడు స్టెప్పుల్లో రూపొందించిన ప్రమిదల ప్రదర్శన, విక్రయాలు ఈ నెల 11 వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటాయన్నారు. కలశం, డిజైనర్ దీపాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఒకే ప్రమిదపై ఐదారు ఒత్తులతో దీపాలు వెలిగించుకునేలా సరికొత్త ప్రమిదలు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. టెర్రకోట ప్రమిదలతో పాటు ఢిల్లీ డిజైనర్ ప్రమిదలు, కోల్‌కతా ప్రమిదలు కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. లేపాక్షిలో టెర్రకోట మట్టి ప్రమిదల విక్రయాలు గత ఎనిమిదేళ్లగా చేపట్టినట్లు తెలిపారు. ఇవి కేవలం లేపాక్షిలోనే లభ్యమవుతాయన్నారు. తడిగుడ్డతో తుడిచినా ప్రమిదలు పాడవ్వవని, నూనె ఎక్కువగా పీల్చవని, ఒకసారి ఉపయోగించిన తర్వాత వాటిని భద్రపరచుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు వినియోగించుకోవాలని కార్తీక్‌కుమార్ కోరారు.